ONE click
ePaper
www.shanmukhavelugu.com

RNI : APTEL / 2023 / 89152
షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
PL.NO.IR/RNP/SV/26/2026

సంపుటి : 03 సంచిక : 222
శనివారం 22 ఆగస్టు 2026 పేజీలు 8 వెల : రూ.3
Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

## ఈనెల 29 నుంచి సీడ్ యాక్సెస్ రోడ్డు మూడో దశ పనులు: నారాయణ

ప్రస్తుతం ఇన్నర్ రింగ్ రోడ్డు, రైల్వే లైన్ పనులపై దృష్టి సారించామన్న నారాయణ

ఆ తర్వాత విమానాశ్రయం నిర్మాణంపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడి

ఇకపై ప్రతినెలా ఒక టవర్ పూర్తయ్యేలా ప్రణాళికలు రూపొందించామన్న మంత్రి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 21)
ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. కీలకమైన సీడ్ యాక్సెస్ రహదారి మూడో దశ పనులపై మంత్రి నారాయణ ప్రకటన చేశారు. ఈ నెల 29వ తేదీన మూడో దశ పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. ▶2లో

## దేశంలో పెరుగుతున్న స్వైన్ ఫ్లూ.. కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా సమీక్ష

జాతీయ స్థాయి సన్నద్ధత, నివారణ చర్యలపై నడ్డా సమీక్ష

నిరంతర నిఘా, వ్యాధి వ్యాప్తి నిరోధక చర్యలను సమీక్షించిన నడ్డా

వ్యాధి లక్షణాలున్నవారిని ముందస్తుగా గుర్తించడం కీలకమన్న కేంద్ర మంత్రి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 21)
దేశంలో స్వైన్ ఫ్లూ (ూ1చీ1) కేసులు నమోదవుతున్న నేపథ్యంలో, జాతీయ స్థాయి సన్నద్ధత, నివారణ చర్యలపై కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. దేశవ్యాప్తంగా నిరంతర నిఘా, వ్యాధి వ్యాప్తి ▶2లో

## ప్రముఖ నటి షావుకారు జానకి కన్నుమూత



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 21)
ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి (94) కన్నుమూశారు. చెన్నైలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతూ తుది శ్వాసవిడిచారు. ఆమె గత కొంత కాలంగా శ్వాసకోశ, వృద్ధాప్య సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల మరోసారి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు చెన్నైలోని కావేరి ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో ఆమె ▶2లో

## ఆయుర్వేద చికిత్స కోసం రేపు కేరళ వెళుతున్న పవన్ కల్యాణ్

భుజం నొప్పికి చికిత్స కోసం కేరళకు పవన్ కల్యాణ్

శస్త్రచికిత్స తర్వాత విశ్రాంతి పెద్దగా తీసుకోకుండా విధుల్లో చేరిక

భుజానికి వాపు, జ్వరం రావడంతో వైద్యుల సూచన

రేపు కేరళకు బయలుదేరనున్న ఉపముఖ్యమంత్రి

ఆయుర్వేద చికిత్సతో పూర్తిస్థాయిలో కోలుకోవడమే లక్ష్యం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 21)
ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ రేపు కేరళకు పయనం కానున్నారు. తన భుజం నొప్పికి ఆయుర్వేద చికిత్స తీసుకునే నిమిత్తం ఆయన శనివారం కేరళకు వెళ్లనున్నట్లు జనసేన పార్టీ ఒక ప్రకటనలో వెల్లడించింది.ఇటీవల పవన్ కల్యాణ్ తన కుడి భుజం 'రొటేటర్ కఫ్' గాయానికి ముంబైలో శస్త్రచికిత్స చేయించుకున్న సంగతి తెలిసిందే. శస్త్రచికిత్స అనంతరం కొంతకాలం పాటు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని, అధికారిక కార్యక్రమాలకు ▶2లో

# కలిసి నడుద్దాం.. కలిసి ఎదుగుదాం

ఏపీ, తమిళనాడు, కర్ణాటక మీదుగా బుల్లెట్ రైల్ కారిడార్

దక్షిణాది రాష్ట్రాల్లో ఉమ్మడి లాజిస్టిక్ నెట్‌వర్క్, డ్రైపోర్టులు

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపాదనలు

విభజన చట్టంలోని అంశాలు ఇప్పటికీ పరిష్కారం కాలేదని కేంద్ర హోంమంత్రి దృష్టికి


సీఎం చంద్రబాబు, తమిళనాడు సీఎం విజయ్ పలకరింపు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 21)
ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలను కలుపుతూ కుప్పం మీదుగా బుల్లెట్ రైల్ కారిడార్‌ను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపాదించారు. అమరావతి, బెంగళూరు, చెన్నై నగరాలను అనుసంధానించే ఈ మార్గం మూడు రాష్ట్రాల మధ్య ఆర్థిక కార్యకలాపాలకు మరింత ఊతమిస్తుందని వివరించారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఉమ్మడి లాజిస్టిక్స్ నెట్‌వర్క్, డ్రైపోర్టులు ఏర్పాటుచేయాలని, దక్షిణ గ్రిడ్‌ను జాతీయ విద్యుత్ గ్రిడ్‌తో అనుసంధానించాలని, యూనివర్సిటీలు, ఇతర నైపుణ్య సంస్థలతో కలిసి సంయుక్త నైపుణ్యాభివృద్ధి వ్యవస్థను నెలకొల్పాలని సూచించారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అధ్యక్షతన గురువారం చెన్నై సమీపంలో జరిగిన 31వ దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ మండలి సమావేశంలో చంద్రబాబు పలు కీలక ప్రతిపాదనలు చేశారు. రాష్ట్ర విభజన సమస్యలు, పెండింగ్ అంశాల్ని ప్రముఖంగా ప్రస్తావించారు. ప్రకృతి విపత్తుల సమయంలో రాష్ట్రాల పరస్పర సహాయానికి ప్రత్యేక విపత్తు నిర్వహణ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేయాలని ప్రతిపాదించారు. 24 అంశాలతో కూడిన ఎజెండాపై ఈ సమావేశంలో చర్చించారు.

**10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా దక్షిణ భారతం :** "రాష్ట్రాల మధ్య సమస్యల్ని పరస్పర సహకారం, సమన్వయంతో పరిష్కరించుకోవాలి. దక్షిణాది రాష్ట్రాలు కలిసికట్టుగా ముందుకు సాగితే భారతదేశ అభివృద్ధికి మరింత బలమైన చోదకశక్తిగా నిలుస్తాయి. 2047 నాటికి దక్షిణ భారతానికి 10 ట్రిలియన్ డాలర్లకుపైగా ఆర్థిక వ్యవస్థగా ఎదిగే సామర్థ్యం ఉంది" అని చంద్రబాబు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ సహా దక్షిణాది రాష్ట్రాలు పరస్పర సహకారంతో, సమగ్రాభివృద్ధి సాధించాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు. "దేశ స్థూల ఉత్పత్తిలో దక్షిణాది రాష్ట్రాల ప్రస్తుత వాటా 31%. 2047 నాటికి భారత్ ▶2లో

## 3.20 లక్షల మంది కౌలురైతులకు ఎరువుల పంపిణీ



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 21)
ఎరువుల పంపిణీకి ఈ ఏడాది మొదటిసారి ప్రవేశపెట్టిన యాప్ ద్వారా ఇప్పటివరకు 3,20, 880 మంది కౌలు రైతులు ఎరువులు కొనుగోలు చేశారని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. ఎమ్మెల్యేలు లేవనెత్తిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. 'ఎమ్మెల్యేలు చెప్పిన సమస్యలన్నిటికీ ఇప్పటికే పరిష్కారం చూపాం. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తినా వెంటనే సరి చేస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో కృష్ణా, కాకినాడ జిల్లాల్లో ఎరువుల పంపిణీకి ప్రయోగాత్మకంగా అమలు చేసిన యాప్ ద్వారా సమస్యలు రావడంతో దాన్ని పక్కన పెట్టి.. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యాప్‌ను దేశవ్యాప్తంగా అమలు చేస్తోంది. ఇది ఎంతో గర్వకారణం. ఒకేసారి యూరియా సరఫరా చేస్తే రైతులు మొత్తం వాడేస్తున్నారన్న కారణంతో శాస్త్రవేత్తల సూచనలతో మూడు విడతల్లో రైతులకు అందిస్తున్నాం. క్లస్టర్ వారీగా వ్యవసాయ పంటలకు ప్రైవేటు సంస్థలు బీమా అమలు చేస్తున్నందున ప్రీమియం విషయంలో వ్యత్యాసం ఉన్న విషయం వాస్తవమే. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం' అని మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు.

## జగన్‌తో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు భేటీ

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 21)
మాజీ మంత్రి, వైకాపా నేత సీదిరి అప్పలరాజు తన కుటుంబ సభ్యులతో మాజీ సీఎం జగన్‌ను తాడేపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం కలిశారు. అప్పలరాజు కుమారుడు ఆరవ్‌వర్మ ఇటీవల బైక్ నడుపుతూ ఢీకొన్న ప్రమాదంలో గొర్రెల కాపరి దానయ్య మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ కేసులో తన కుమారుడిని తప్పించేందుకు ప్రయత్నించారన్న అభియోగాలతో అప్పలరాజుపై కేసు నమోదైంది. తర్వాత ఆయన్ను పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల బెయిల్‌పై బయటకొచ్చిన ఆయన తన కుటుంబ సభ్యులతో వచ్చి జగన్‌ను కలిశారు. అప్పలరాజు కుమారుడు ఆరవ్ వర్మ కూడా వారితో పాటు ఉన్నారు. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త చింతాడ రవికుమార్.. జగన్‌ను తాడేపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఇటీవల జగన్ శ్రీకాకుళం జిల్లా పర్యటన సందర్భంగా బందోబస్తులో ఉన్న మహిళా ఎస్సైపై దాడి చేసిన కేసులో అరెస్టైన రవికుమార్, తర్వాత బెయిల్‌పై బయటకొచ్చారు.జగన్ శుక్రవారం హైదరాబాద్‌లో పర్యటించనున్నారు. సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు కుమారుడి వివాహ వేడుకకు హాజరు కానున్నారు. పెళ్లికి హాజరైన అనంతరం బెంగళూరుకు పయనమవుతారు.



## వైకాపా ఎంపీ అవినాష్ నివాసంలో రూ.24లక్షల నగదు సీజ్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 21)
మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాలు ముగిశాయి. సీబీఐ కేసు ఆధారంగా హైదరాబాద్, కడప సహా ఏడు చోట్ల ఈడీ తనిఖీలు చేపట్టింది. ఈ కేసులోని కీలక నిందితుల నివాసాల్లో సోదాలు జరిగాయి. పలు పత్రాలు, డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. వైకాపా ఎంపీ అవినాష్ రెడ్డి నివాసాల్లోనూ ఈడీ అధికారులు తనిఖీలు చేశారు. అవినాష్ నివాసంలో లెక్క చూపని రూ.24లక్షల నగదును సీజ్ చేశారు. ఆయనకు చెందిన రెండు లాకర్ల తాళాలను స్వాధీనం చేసుకున్నారు. సోదాల్లో లభించిన డిజిటల్, ఆర్థిక ఆధారాలపై ఈడీ దర్యాప్తు కొనసాగిస్తోంది.

## మార్గదర్శి అంశం.. నిజాయతీకి దక్కిన మహోన్నత విజయం వెంకయ్యనాయుడు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 21)
మార్గదర్శి అంశంలో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు నిజాయతీకి దక్కిన మహోన్నత విజయమని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు."మార్గదర్శి వ్యవహారంలో సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన చరిత్రాత్మక తీర్పు నిజాయతీకి దక్కిన మహోన్నత విజయం. రామోజీరావు హిమాలయమంత ధైర్యం, ఆత్మవిశ్వాసంతో ఆ నిందారోపణలను ఎదుర్కొని సుదీర్ఘ న్యాయ పోరాటం చేశారు. అంతిమంగా ధర్మమే గెలిచింది"అని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

## ప్రణయ్ తేజ్ ఘటన నుంచి ఇంకా తేరుకోలేకపోతున్నాను: నారా లోకేశ్

విశాఖ చిన్నారి ప్రణయ్ తేజ్ మృతి ఘటనపై మంత్రి లోకేశ్ తీవ్ర ఆవేదన

ఒక తండ్రిగా ఆ తల్లిదండ్రుల బాధను ఊహించలేకపోతున్నానని వ్యాఖ్య

పాఠశాలల్లో శారీరక దండనలకు చోటులేదని స్పష్టీకరణ

ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 21)
పాఠశాల విద్యార్థి ప్రణయ్ తేజ్ మృతి ఘటనపై ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి, ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని, క్రమశిక్షణ పేరుతో చిన్నారులపై హింసకు పాల్పడటాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా ఖాతాలో ఒక పోస్ట్ పెట్టారు."ఒక తండ్రిగా, విశాఖ చిన్నారి ప్రణయ్ తేజ్‌కు జరిగిన ఘటన ▶2లో



మొదటి పేజీ తరువాయి

## ఈనెల 29 నుంచి సీడ్ యాక్సెస్ రోడ్డు మూడో దశ పనులు: నారాయణ

గుంటూరు జిల్లా తుళ్లూరులోని వందల ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి, శ్రీ బాలకోటేశ్వర స్వామి ఆలయాల పునఃప్రతిష్ఠ మహోత్సవంలో మంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

గతంలో రాజధాని రైతులు అమరావతి పరిరక్షణ కోసం చేపట్టిన 'న్యాయస్థానం టు దేవస్థానం' పాదయాత్ర ఇదే తుళ్లూరు ఆలయం నుంచే ప్రారంభమై విజయవంతమైందని మంత్రి గుర్తుచేశారు. రైతుల త్యాగాల పునాదులపైనే అమరావతి మళ్లీ పునర్నిర్మాణం అవుతోందన్నారు. రాజధాని నిర్మాణంలో భాగమైన ఇన్నర్ రింగ్ రోడ్డు, రైల్వే లైన్ పనులపై ప్రస్తుతం ప్రధానంగా దృష్టి సారించామని, ఆ తర్వాత విమానాశ్రయం నిర్మాణ అంశంపై తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

అమరావతి పరిపాలనా నగరంలో టవర్ల నిర్మాణాన్ని వేగవంతం చేస్తూ ప్రతినెలా ఒక్కో టవర్ నిర్మాణాన్ని పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. అలాగే, రాజధాని రైతుల రిటర్నబుల్ ప్లాట్ల అభివృద్ధి పనులకు సంబంధించి ఈ నెల 27న టెండర్లు ఓపెన్ చేస్తున్నామని, ప్రక్రియ పూర్తి కాగానే క్షేత్రస్థాయిలో పనులు వేగంగా మొదలుపెడతామని మంత్రి స్పష్టం చేశారు.

## దేశంలో పెరుగుతున్న స్వైన్ ఫ్లూ.. కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా సమీక్ష

నిరోధక చర్యలు పటిష్ఠంగా ఉండాలని ఆయన అధికారులను ఆదేశించారు.ఢిల్లీతో పాటు ఇతర ప్రధాన ప్రాంతాల్లోని ఆసుపత్రులలో బెడ్ల లభ్యత, ఐసోలేషన్ వార్డుల ఏర్పాటుతో పాటు అవసరమైన మందులు, టీకాల లభ్యతపై మంత్రి సమగ్రంగా సమీక్షించారు. నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్, హెల్త్ సెక్రటరీలతో కూడిన బృందానికి నిరంతరం కేసులను పర్యవేక్షించాలని సూచించారు.

ముఖ్యంగా వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే ముందస్తుగా గుర్తించడం, బాధితులకు సకాలంలో చికిత్స అందించడం.. ప్రజల్లో పరిశుభ్రత, అవగాహన పెంపొందించడం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాలు, మారుమూల జిల్లాల్లో కూడా అవసరమైన ఫ్లూ నిరోధక మందుల కొరత లేకుండా చూడాలని అన్ని రాష్ట్రాల ఆరోగ్య శాఖలను కోరారు.

## కలిసి నడుద్దాం.. కలిసి ఎదుగుదాం

30-35 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న లక్ష్య సాధనలో దక్షిణాది రాష్ట్రాలు ప్రధాన భూమిక పోషిస్తాయి. దక్షిణాది రాష్ట్రాలన్నీ సమష్టిగా 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థికశక్తిగా ఎదుగుతాయి" అని సీఎం పేర్కొన్నారు. దక్షిణాదిలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను ఉత్తర భారతదేశంలోని ఆధ్యాత్మిక కేంద్రాలతో అనుసంధానిస్తూ ప్రత్యేక వారసత్వ, పర్యాటక, తీర్థయాత్ర సర్క్యూట్ ఏర్పాటుచేయాలని సూచించారు. తిరుపతి, శ్రీశైలం, కాంచీపురం, మదురై, రామేశ్వరం, మైసూరు లాంటి ప్రాంతాలను వారణాసి, అయోధ్య, చార్‌ధామ్ క్షేత్రాలతో అనుసంధానిస్తే దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించే అవకాశం ఉంటుందని తెలిపారు.

### విభజన సమస్యలు ఇప్పటికీ తీరలేదు

రాష్ట్ర విభజనకు సంబంధించిన పెండింగ్ అంశాల్ని చంద్రబాబు ప్రస్తావించారు. విభజన జరిగి 12 ఏళ్లయినా 9, 10 షెడ్యూళ్లలోని సంస్థల విభజన పూర్తికాలేదన్నారు. "ఆస్తులు, అప్పులు, సంస్థల విషయంలో సమన్యాయం జరగాలి. విభజన చట్టంలోని సెక్షన్ 66 కింద ఉన్న అంశాలపై కేంద్ర నిర్ణయం కోసం గత తొమ్మిదేళ్లుగా ఎదురుచూస్తున్నాం. సెక్షన్ 56లోని సమస్యలు, వనరుల లోటు, ఆర్థిక భారానికి సంబంధించిన అంశాల్నీ పరిష్కరించాలి" అని సీఎం కోరారు. రాష్ట్రానికి కేంద్రం అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలియజేశారు. కేంద్రం హామీ ఇచ్చిన 11 జాతీయ సంస్థల్లో 10 ఇప్పటికే ఏర్పాటవడం సంతోషదాయకమన్నారు. పోలవరం, దక్షిణ కోస్తా రైల్వే జోన్, అమరావతి నిర్మాణంలో కేంద్ర సహకారం ఎంతో కీలకమని చెప్పారు. దిల్లీలోని ఏపీ భవన్ ఆస్తుల విభజన అంశాన్నీ సీఎం ప్రస్తావించారు. రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించినందుకు కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపారు. "నీటి వనరులు, పచ్చదనం, జీవన ప్రమాణాలు, కనెక్టివిటీ, ఆర్థిక అవకాశాల్ని దృష్టిలో ఉంచుకుని నూతన రాజధాని నిర్మిస్తున్నాం" అని తెలిపారు. విభజన చట్టంలోని షెడ్యూల్-13 కింద ఉన్న ప్రాజెక్టులకు వేగంగా అనుమతులివ్వాలని సీఎం కోరారు. విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్, మూడు విమానాశ్రయాల అభివృద్ధి, కొత్త రాజధానికి రైలు అనుసంధానం లాంటి పనులు వేగంగా పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశారు. దుగరాజపట్నం పోర్టు, బీపీసీఎల్ రిఫైనరీ, విశాఖ, విజయవాడ నగరాల్లో మెట్రో రైలు ప్రాజెక్టులు, కడపలోని జిందాల్ స్టీల్‌కు రైలు అనుసంధానంపై అనుమతులు మంజూరుచేయాలని కోరారు.

### నదుల అనుసంధానంతో మిగులు జలాలు

భవిష్యత్తు నీటి భద్రతకు నదుల అనుసంధానమే శాశ్వత పరిష్కారమని చంద్రబాబు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి, కృష్ణా, వంశధార, నాగావళి, పెన్నా లాంటి 40 నదులు 28 జిల్లాలకు సాగునీరు అందిస్తున్నాయి. గోదావరి-కావేరి అనుసంధానంలో భాగంగా పోలవరం, కృష్ణా, పెన్నా మీదుగా 500 టీఎంసీలకుపైగా మిగులు వరద జలాల్ని కావేరి బేసిన్‌కు తరలించే ప్రతిపాదనను సీఎం కేంద్రం ముందుంచారు. ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు ప్రయోజనం చేకూరుస్తుందని తెలిపారు. గంగా-కావేరి అనుసంధానాన్ని జాతీయ ప్రాజెక్టుగా చేపట్టాలని సూచించారు. "గంగానది మిగులు జలాల్ని దక్షిణాదికి తరలించడం ద్వారా తమిళనాడుతో పాటు దక్షిణాది రాష్ట్రాల నీటి భద్రతకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. నదీ పరీవాహక ప్రాంతాల మధ్య సమన్వయానికి ప్రత్యేక దక్షిణాది నదీ బేసిన్ల సమన్వయవ్యవస్థను ఏర్పాటుచేయాలి. డీపీఆర్‌లు, అనుమతుల్ని నిర్దిష్ట కాలపరిమితిలోగా పూర్తిచేయాలి" అని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

### రూ.16 వేల కోట్ల ఆర్థికలోటు భర్తీ చేయండి

రాష్ట్రానికి పరిష్కారం కాని బిల్లులు, రైతులకు రుణమాఫీకి సంబంధించిన బకాయిల్లాంటి నాలుగు హెడ్‌ల కింద రూ.32 వేల కోట్లు రావాల్సి ఉండగా, ఇప్పటివరకు రూ.16 వేల కోట్లు ఇచ్చారని, మిగతా రూ.16 వేల కోట్లు కూడా మంజూరుచేయాలని కేంద్రాన్ని రాష్ట్రం కోరింది.

### దార్శనికుడిలా మాట్లాడారని చంద్రబాబుకు ప్రశంసలు

దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ మండలి సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగం, ఆయన చేసిన సూచనలు దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రుల ప్రశంసలు అందుకున్నాయి. సీఎం కేవలం ఆంధ్రప్రదేశ్ సమస్యల ప్రస్తావనకే పరిమితం కాకుండా.. దేశ విస్తృత ప్రయోజనాల్ని దృష్టిలో ఉంచుకుని, దేశాభివృద్ధిలో దక్షిణాది రాష్ట్రాల పాత్ర, వాటి సమష్టి ఆర్థికశక్తి, నీటి, ఇంధన భద్రత, రవాణా అనుసంధానం, విపత్తుల నిర్వహణ, విద్య, నైపుణ్యాభివృద్ధి లాంటి అంశాలతో మొత్తం దక్షిణ భారత దేశానికి ఒక దీర్ఘకాలిక ఉమ్మడి అభివృద్ధి ఎజెండాను ప్రతిపాదించడం ఆకట్టుకుంది. కేంద్రానికి, రాష్ట్రాలకు మధ్య, రాష్ట్రాలకు, రాష్ట్రాలకు మధ్య ఘర్షణలు అభివృద్ధికి ఉపయోగపడవని, పరస్పర విశ్వాసం, సంప్రదింపులు, ఇచ్చిపుచ్చుకునే ధోరణి, సహకార సమాఖ్య విధానంతోనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆయన వివరించారు. దక్షిణాది రాష్ట్రాలు పెట్టుబడులు, పరిశ్రమలు, మౌలిక వసతుల కోసం పరస్పరం పోటీ పడటంతోనే ఆగిపోకుండా, కొన్ని కీలక రంగాల్లో కలిసికట్టుగా పనిచేయాలని సూచించడం ఆకట్టుకుంది. సీనియర్ నాయకుడు, అనుభవజ్ఞుడైన చంద్రబాబు ఒక దార్శనికుడిలా మాట్లాడారని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సహా పలువురు ప్రశంసించారు. ఈ సమావేశంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు తమిళనాడు, కర్ణాటక, కేరళ ముఖ్యమంత్రులు జోసెఫ్ విజయ్, డీకే శివకుమార్, వి.డి.సతీశన్, తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ లెఫ్టినెంట్ గవర్నర్లు కె.కైలాశ్‌నాథన్, అడ్మిరల్ డి.కె.జోషి, ఆయా రాష్ట్రాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ప్రముఖ నటి షావుకారు జానకి కన్నుమూత

కన్నుమూశారు.షావుకారు జానకి.. నటి కృష్ణకుమారికి సోదరి. ఆంధ్రప్రదేశ్‌లోని రాజ మహేంద్రవరంలో 1931 డిసెంబర్ 12న జన్మించారు. చిన్నతనంలోనే నాటకాల్లో పలు పాత్రలు పోషిస్తూ కెరీర్ ప్రారంభించారు. 11 ఏళ్లకు రేడియోలో ఒక తెలుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. 1949లో 'రక్షా రేఖ' సినిమాతో చలనచిత్ర రంగంలోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత 1950లో 'షావుకారు' సినిమా హిట్ కావడంతో ఆమెకు షావుకారు జానకిగా పేరు వచ్చింది. ఆ తర్వాత అనేక సూపర్ హిట్ చిత్రాల్లో జానకి నటించారు. తెలుగు, తమిళ, కన్నడ భాషలలో సుమారు 400 చిత్రాల్లో, 3 హిందీ సినిమాల్లోనూ, ఒక మలయాళ చిత్రంలో నటించి మెప్పించారు. సినీ రంగానికి ఆమె చేసిన సేవలకు గాను భారత ప్రభుత్వం ఆమెను 2022లో పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది.'వద్దంటే డబ్బు', 'కన్యా శుల్కం', 'పిచ్చి పుల్లయ్య' , 'రేచుక్క-పగటిచుక్క, 'రోజులు మారాయి', 'సొంతవూరు', 'జయం మనదే', 'డాక్టర్ చక్రవర్తి', 'సంసారం ఒక చదరంగం', 'తోడికోడళ్ళు', 'బాబు బంగారం', 'గీతాంజలి' ఇలా అనేక హిట్ చిత్రాలలో జానకి నటించారు. చివరి సారి 'అన్నీ మంచి శకునములే'లో ఆమె కనిపించారు.

## ప్రణయ్ తేజ్ ఘటన నుంచి ఇంకా తేరుకోలేకపోతున్నాను: నారా లోకేశ్

గురించి నేను ఇంకా తేరుకోలేకపోతున్నాను. అతని తల్లిదండ్రులు అనుభవిస్తున్న బాధను ఊహించుకోలేను. మన పాఠశాలల్లో శారీరక దండనలకు ఏమాత్రం చోటు లేదు. క్రమశిక్షణ పేరుతో ఏ బిడ్డపైనా హింస జరగకూడదు" అని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు.

ఈ దురదృష్టకర ఘటనపై ఇప్పటికే పూర్తిస్థాయి విచారణకు ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ తీవ్రమైన దుఃఖ సమయంలో ప్రణయ్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు లోకేశ్ పేర్కొన్నారు.

ఈ ఘటనకు సంబంధించి ఇండియా టుడేలో ప్రచురితమైన కథనాన్ని తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకుంటూ లోకేశ్ ఈ విధంగా స్పందించారు. మంత్రి ఆదేశాలతో విద్యాశాఖ అధికారులు ఈ ఘటనపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

## ఆయుర్వేద చికిత్స కోసం రేపు కేరళ వెళుతున్న పవన్ కల్యాణ్

దూరంగా ఉండాలని వైద్యులు ఆయనకు సూచించారు.

అయితే, పరిపాలనా బాధ్యతల దృష్ట్యా పవన్ కల్యాణ్ శస్త్రచికిత్స జరిగిన వారంలోపే తిరిగి విధుల్లో చేరారు. ముందస్తుగా నిర్ణయించిన ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు, శాఖాపరమైన సమీక్షలు, పార్టీ అంతర్గత సమావేశాలను ఆయన నిర్వహించారు.

విశ్రాంతి లేకుండా విధుల్లో పాల్గొనడం వల్ల ఆయన భుజానికి వాపు రావడంతో పాటు తీవ్రమైన జ్వరం కూడా వచ్చినట్లు జనసేన పార్టీ పేర్కొంది. ఈ నేపథ్యంలో, భుజం నొప్పి నుంచి పూర్తిస్థాయిలో కోలుకోవడానికి కేరళలో ప్రత్యేక ఆయుర్వేద చికిత్స తీసుకోవాలని వైద్యులు సూచించగా, ఆయన రేపు అక్కడకు వెళ్లనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## బ్రహ్మంగారి మఠంలో ఘనంగా వరలక్ష్మీ వ్రతం వేడుకలు







(షణ్ముఖ వెలుగు, బ్రహ్మం గారి మఠం, ఆగస్టు 21)

మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీరధర్మజ వేంకటాద్రి స్వాములవారి దంపతులు, దత్తాత్రేయ స్వామి దంపతుల పవిత్ర హస్తాల మీదుగా, శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠం కళ్యాణ మండపంలో మొట్టమొదటి సారిగా శ్రీ వరలక్ష్మీ వ్రత పూజలు అత్యంత వైభవంగా, నేత్రపర్వంగా నిర్వహించబడ్డాయి. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ శ్రీ వరలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు మరియు దివ్య అలంకరణలు శోభాయమానంగా జరిగాయి. పూజ అనంతరం మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీరధర్మజ వేంకటాద్రి స్వాములవారు ఆధ్యాత్మిక అనుగ్రహ భాషణం చేసి భక్తులకు లక్ష్మీదేవి కృపాకటాక్షాలు కలగాలని ఆశీస్సులందించారు. ఈ పవిత్ర పూజా మహోత్సవంలో గ్రామానికి చెందిన మహిళలు, పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో వ్రతం ఆచరించారు. అనంతరం అమ్మవారికి మహానైవేద్య సమర్పణ, విచ్చేసిన భక్తులందరికీ, గ్రామస్తులకు తీర్థప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమం ఘనంగా జరిగింది. మఠం కళ్యాణ మండపంలో మొదటిసారిగా నిర్వహించిన ఈ సామూహిక వ్రత మహోత్సవం గ్రామంలో ఎంతో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపింది.

## జిల్లాలో నాలుగు రోజులు ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు

### జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, ఆగస్టు 21)




ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)లో భాగంగా ఈ నెల 22, 23, 29, 30 తేదీల్లో ప్రత్యేక ప్రచార, నమోదు శిబిరాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఈ నాలుగు రోజుల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రతి పోలింగ్ కేంద్రంలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు అందుబాటులో ఉండనున్నారు. ముసాయిదా ఓటరు జాబితాలు, ఏఎస్‌డీడీ జాబితాలను పరిశీలించేందుకు, సందేహాలను నివృత్తి చేసేందుకు, అవసరమైన దరఖాస్తులను స్వీకరించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా 18-19 ఏళ్ల యువ ఓటర్లను పెద్ద సంఖ్యలో నమోదు చేయడంతో పాటు, ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు నమోదు కాని అర్హులైన పౌరులను ఓటర్లుగా చేర్చేందుకు ఈ ప్రత్యేక శిబిరాలను వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. అవసరమైన 6, 7, 8, 8ఏ దరఖాస్తు పత్రాలను పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రత్యేక శిబిరాలపై జిల్లాస్థాయి నుంచి పోలింగ్ కేంద్రాల స్థాయి వరకు విస్తృత ప్రచారం నిర్వహించాలని, ఇందుకోసం ప్రింట్, ఎలక్ట్రానిక్ మాధ్యమాలతో పాటు స్థానికంగా ఇతర ప్రచార మార్గాలను కూడా వినియోగించి ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. శిబిరాల నిర్వహణను జిల్లా ఎన్నికల అధికారి స్వయంగా పర్యవేక్షించడంతో పాటు, ఎన్నికల అధికారులు పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ప్రత్యేక శిబిరాల్లో బీఎల్ఓలు గైర్హాజరైతే తీవ్రంగా పరిగణించి సంబంధిత అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సివుంటుందన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణలో భాగంగా జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ కాలం కొనసాగుతున్నందున అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని సూచించారు.

## దాసరి పిచ్చయ్య నాయుడుని పరామర్శించిన జనసేన యువ నేత బాలినేని ప్రణీత్‌రెడ్డి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 21)



ఇటీవల ప్రమాదానికి గురై చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న ఒంగోలు జనసేన పార్టీ నాయకులు దాసరి పిచ్చయ్య నాయుడు, బండారు సురేష్‌లను ప్రకాశం జిల్లా జనసేన పార్టీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి శుక్రవారం వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా వారి నివాసాలకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ కోసం పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలు, తన సన్నిహిత సహచరుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, వారి కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ తోడుగా ఉంటానని బాలినేని ప్రణీత్‌రెడ్డి మరోసారి చాటిచెప్పారు. నాయకుల పట్ల ఆయన చూపుతున్న ఆప్యాయత, ఆత్మీయతకు ఈ పరామర్శ నిదర్శనంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఒంగోలు మాజీ కార్పొరేటర్లు చిన్నారి, నాగరాజు, మలగా రమేష్, గోవర్ధన్, రాష్ట్ర కాపునాడు జాయింట్ సెక్రటరీ ఈమని మదన్ మోహన్, ఒంగోలు పార్లమెంట్ కాపునాడు అధ్యక్షుడు పోగుల మల్లికార్జునరావు, ఒంగోలు పార్లమెంటరీ కాపునాడు కన్వీనర్ వెలుగోలు కాశీ విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.


ప్రకాశం

మార్కాపురం

బాపట్ల

షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
22.08.26 శనివారం


# "అన్నా" ను ఓడించానని చెబుతున్న గునుపూడి భాస్కర్

## ఆర్యవైశ్యులకు అన్యాయం జరుగుతుంటే ఏం చేస్తున్నావ్

**కోమట్ల ఆస్తులు అక్రమ రిజిస్ట్రేషన్ జరిగితే పట్టించుకున్న పాపాన పోలేదు**

**మీ పార్టీకి ఓట్లు వేసిన ఆర్యవైశ్యుల ఆస్తులను మీ పార్టీ నేతలే అక్రమ రిజిస్ట్రేషన్లు చేశారు**

**మీ పార్టీ సొసైటీ ప్రెసిడెంట్, మీ పార్టీ మండల అధ్యక్షుడు, కార్యకర్తలు అక్రమ రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు**

**నీకు ఛైర్మన్ పదవి కావాలని నన్ను ఓడించానని చెప్పుకోవడానికి సిగ్గుండాలి**

**అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయకుంటే ఆర్యవైశ్యులకు అండగా నిలుస్తా**

**ఆర్యవైశ్యులు తనకు ఓట్లు వేయకపోయినా వారికి అండగా ఉంటా**


**అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయాల్సిందే**

**9 మందికి నోటీసులు ఇచ్చిన సొసైటీ ప్రెసిడెంట్ మీగడ ఈశ్వర్‌రెడ్డి ముగ్గురు ఆర్యవైశ్యుల వారివి మాత్రమే ఎందుకు రిజిస్టర్‌లు చేశారు**

**అందరి లెక్కలు తేలుస్తా**

**మీడియా సమావేశంలో గునుపూడి భాస్కర్ పై నిప్పులు చెరిగిన మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం వైసీపీ ఇన్‌ఛార్జి అన్నా రాంబాబు**






**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 21)**

అన్నా రాంబాబును ఓడించానని చెబుతున్న టిడిపి నాయకులు గునుపూడి భాస్కర్ పొదిలి పట్టణంలో ఆర్యవైశ్యులకు అన్యాయం జరుగుతుంటే ఏం చేస్తున్నావని గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జి అన్నా వెంకట రాంబాబు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయించాలని కోరుతూ చీతిరాల శేషగిరిరావు కుటుంబ సభ్యులు మీ ఇంటికి వస్తే నేను రాను, వస్తే నా రాజకీయం దెబ్బతింటుంది అని అనడం వాస్తవంకాదా అని ప్రశ్నించారు. పొదిలి పట్టణంలోని చిన్న బస్టాండ్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వైసీపీ కార్యాలయంలో ఆయన శుక్రవారం సాయంత్రం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం గునుపూడి భాస్కర్ తన వ్యక్తిగత ఇన్‌స్టా పేజీలో గునుపూడి భాస్కర్ గత 44 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీ కోసం చేసిన కష్టాన్ని, చేసిన పలు సేవా కార్యక్రమాలను తెలుపుతూ ఓ లేఖను పొందుపరిచారు. దీని పైన స్పందించని మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు గతేడాది మా అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పొదిలి పొగాకు బోర్డును పరిశీలించేందుకు వచ్చే క్రమంలో నీ ఇంటి వద్ద నుంచే ఆయన జగన్మోహన్‌రెడ్డి కాన్వాయ్ పై రాళ్ళు వేయించిందని, మహిళలతో పెద్ద ఎత్తున నిరసన చేపట్టారని, మా పార్టీ నాయకులు, కార్యకర్తలు సుమారు 50 మంది పైన కేసులు పెట్టించారనే విషయాన్ని మర్చిపోకుండా ఆ లేఖలో రాసి ఉంటే బాగుండేదని తెలిపారు. ఆ వ్యాఖ్యలు ఆ లేఖలో రాసి ఉంటే టిడిపి అధిష్టానం వద్ద ఇంకా మార్కులు వచ్చి ఉండేవన్నారు. ఇంకా త్వరిగతిన ఛైర్మన్ సీటో లేక నామినేటెడ్ పోస్టో వచ్చేదన్నారు. ఎందుకో భాస్కరన్న పాపం ఆ విషయం మర్చిపోయారన్నారు. ఈ లేఖలో ఆయన తాను తెలుగుదేశం పార్టీ కోసం పడ్డ కష్టాన్ని తెలియజేస్తూ ఛైర్మన్ పదవి కావాలని కోరడంలో తప్పు లేదన్నారు. అది వారి వ్యక్తిగత విషయమన్నారు. అయితే ఆ లేఖలో మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ తరుపున ఆర్యవైశ్యులైన అన్నా వెంకట రాంబాబు నిలబడినా పొదిలి పట్టణ ఆర్యవైశ్యుల ఓట్లలో 80 శాతం ఓట్లను తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డికి వేయించానని చెప్పుకొచ్చారు. అది ఆర్యవైశ్యులు మా కుటుంబానికి ఇచ్చే గౌరవం అని వ్రాశారన్నారు. మున్సిపల్ ఛైర్మన్‌గా పోటీ చేసే అవకాశం నాకు మీరు కల్పిస్తే ప్రజలకు నేను అందించే సేవలు నాకు వరాలుగా మారి అఖండ విజయానికి దోహదపడతాయన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఛైర్మన్‌లకు డైరక్టు ఓటుగా అసెంబ్లీలో పాస్ చేయడంతో ప్రజల్లో నా పై ఉన్న అభిమానం ఏ స్థాయిలో ఉంటుందో, ఎంత మెజార్టీ వస్తుందో మీకే తెలుస్తుందని ఆ లేఖలో ప్రస్తావించారన్నారు. 80 శాతం ఆర్యవైశ్యుల చేత మీరు టీడీపీకి ఓట్లు వేయించి నన్ను ఓడించిన మీరు ఆ 80 శాతం మంది ఆర్యవైశ్యులకు అన్యాయం జరుగుతుంటే మీరెక్కడ నిద్రపోతున్నారని ప్రశ్నించారు. ఆర్యవైశ్య కులానికి చెందిన యాదాల అవినాష్ పై దాడి చేసిన ఎస్ఐపై ఆర్యవైశ్య వ్యాపార వర్గాలతో పాటు అన్ని కులాల వారు, అన్ని రాజకీయ పార్టీల వారు ఖండిస్తే ఆ రోజు అన్నా రాంబాబు పేరును ప్రస్తావించడానికి మీకు నోరు రాలేదు కాని అన్నా రాంబాబును ఓడించాం నాకు ఛైర్మన్ పదవి కావాలని ఏ విధంగా అధిష్టానాన్ని అడుగుతున్నావని ప్రశ్నించారు. అన్నా రాంబాబును ఆర్యవైశ్య కులం నుంచి బహిష్కరించినట్లుగా మార్కాపురం, పొదిలి పట్టణాల్లో టీడీపీ కి ఓట్లు వేశాం ఈ రోజు ఆర్యవైశ్యులకు ఇన్ని ఇబ్బందులు జరుగుతున్నాయో ప్రశ్నించేందుకు నీకు ఎందుకు నోరు లేయలేదని ప్రశ్నించారు. అవినాష్ పై దాడి చేసిన ఎస్ఐ ని మీరందరు కలిసి గెలిపించుకున్న ఎమ్మెల్యే మార్కాపురంలో పోస్టింగ్ ఇచ్చారన్నారు. అలాగే విశ్వనాధపురం సొసైటీ పేరుతో 9 మందికి నోటీసులు ఇచ్చి కేవలం ముగ్గురు ఆర్యవైశ్యులకు సంబంధించిన ఇళ్ళు, స్థలాలు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేస్తే ఎక్కడ పడుకున్నావని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అన్నా రాంబాబును కోడ్ చేసి ఓడించానని, కులం కూడా చూడలేదని లేఖలో వ్రాసిన నీవు అన్ని కులాలు వారి వారి నాయకులకు అభిమానం చూపించినా మేము మాత్రం ఆర్యవైశ్య కులానికి చెందిన అన్నా రాంబాబుకు అభిమానం చూపకుండా ఓడించామని గొప్పలు చెప్పుకునే నీవు ఆర్యవైశ్యులకు అన్యాయం చేసిన మీ పార్టీ నాయకులను ఎందుకు ప్రశ్నించలేదని మండిపడ్డారు. నీ సీటు కోసం అన్నా రాంబాబును ఓడించానని చెప్పుకోవడానికి సిగ్గుండాలి అని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఆర్యవైశ్యులకు అన్యాయం జరుగుతుంటే ఎందుకు అడగలేదన్నారు. ఈ విషయాన్నింటిపైన కూడా లేఖలో ప్రస్తావించి ఉంటే నిన్ను నీ పార్టీ, సమాజం హర్షించేదన్నారు. నువ్వు గొప్పోడివే...నీతో పాటు మార్కాపురంలోని ఆర్యవైశ్యులు కూడా గొప్పోళ్లే...అన్నా రాంబాబును ఓడించేందుకు 80 శాతం ఓట్లు వేయించి ఉండచ్చు కానీ ఈ రోజు నియోజకవర్గంలో మీకు స్వతహాగా దిక్కులేదన్నారు. మీ ఆస్తులు దోచుకుంటుంటే అడిగే దమ్ము మీకు లేదు...అన్నా రాంబాబు అనే వ్యక్తి నాలుగు సార్లు ఎన్నికల్లో పోటీ చేశానని, మొదట ప్రజారాజ్యంలో పోటీ చేశానని ఆ తర్వాత తెలుగుదేశం పార్టీలో తదుపరి వైసీపీలో పోటీ చేశానన్నారు. ఆ పార్టీ నాయకులనే నన్ను పిలిచి మరీ సీటు ఇచ్చారే కాని నీలాగ సీటు కావాలని దేబరించుకోలేదన్నారు. నాలుగో పర్యాయం నేను పోటీ చేయనని నాలుగు నెలల ముందే పత్రికా ప్రకటనలు ఇచ్చానని, కానీ మా అధి నాయకుడు నన్ను పిలిచి సీటు ఇచ్చారన్నారు. ఆయన గౌరవం కోసం మాత్రమే పోటీ చేశానన్నారు. ఆర్యవైశ్య కులానికి అన్యాయం జరిగినపుడు నా పేరు ఉచ్చరించి ఉంటే తాను కూడా హర్షించేవాడినన్నారు. అంతే గాని నీ వ్యక్తిగత స్వార్థం కోసం ఇలా తన పేరు వాడుకోవడం దుర్మార్గమన్నారు. నిన్ను నమ్మి ఓట్లు వేసిన ఆర్యవైశ్యులకు ఏం జరుగుతుందో చూసుకోవాలని సూచించారు. రాంబాబు ను ఓడించానని గొప్పగా చెప్పుకుంటున్న మీరు రాష్ట్రంలోనే రెండే అత్యధిక మెజార్టీ 81,500 ఓట్ల మెజార్టీ సాధించిన చరిత్ర కూడా అన్నా రాంబాబుకు ఉందని గుర్తుంచుకోవాలన్నారు. ఒక్క కులంతోనే గెలుపోటములు నిర్ణయించవన్నారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమన్నారు. ఇంత దుర్మార్గం జరుగుతుంటే నీవు నీ కుటుంబం ముగ్గురు ఆర్యవైశ్యులకు సంబంధించిన అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగితే నీవు ఏం చేస్తున్నావని ప్రశ్నించారు. అక్రమ రిజిస్ట్రేషన్లు చేసింది మీ పార్టీ సొసైటీ ప్రెసిడెంట్...చేసింది మీ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడికి, కార్యకర్తలకు చేశారన్నారు. ఓట్లు వేయించడమే కాదు నమ్మి ఓట్లు వేసిన వారికి అండగా నిలవాల్సిన బాధ్యత నాయకుడిగా నీకుండాలన్నారు. దీనిని విస్మరించడం మంచిది కాదు భాస్కరన్న అని తెలిపారు. సొసైటీ అధ్యక్షుడు మీగడ ఈశ్వర్‌రెడ్డి మిమ్మల్ని సొసైటీ అధ్యక్షుడిని చేసింది ఇక్కడి ఆర్యవైశ్యులను బ్లాక్‌మెయిల్ చేసి ఏదో ఒక విధంగా దండుకోవడానికి కాదన్నారు. ఆస్తులను పరిరక్షించాలన్నారు. సొసైటీ అధ్యక్షుడిగా వచ్చింది దౌర్జన్యం చేసి దోచుకోవాలని భావన కనిపిస్తుందన్నారు. ఇప్పటికి ముగ్గురుకు సంబంధించి ఇళ్ళు రిజిస్ట్రేషన్లు చేశారన్నారు. ఆర్యవైశ్యులు తనకు ఓట్లు వేయకపోయినా సమాజంలో గౌరవస్థానంలో ఉండే ఆర్యవైశ్యులకు తాను అండగా ఉంటానన్నారు. అన్యాయం జరిగినా కూడా దానిని కూడా విస్మరించి సిగ్గులేకుండా మేము పార్టీ పుట్టినప్పటి నుండి తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేశామని మాకు తెలుగుదేశంలో అన్యాయం జరగదని ఆర్యవైశ్యులు చెప్పడం సిగ్గుచేటన్నారు. ఇప్పుడు అన్యాయం జరిగింది మీకు కాదా అని ఆయన ప్రశ్నించారు. ఈశ్వర్‌రెడ్డి దోచుకోవాలని చూస్తే సహించేది లేదన్నారు. ఒక్కొక్కటి బయటకు తీస్తానన్నారు. అక్రమ రిజిస్ట్రేషన్లు చేసే దానికి మీకు కేవలం ముగ్గురు ఆర్యవైశ్యులే దొరికారా....ఒకటి మీ మండల పార్టీ అధ్యక్షుడి పేరున, మిగిలిన రెండు మీ అనుచరుల పేరున రిజిస్ట్రేషన్ చేస్తారా అని ప్రశ్నించారు. ఇది మంచి పద్ధతి కాదు. చేసిన తప్పును సరిదిద్దుకుని తక్షణమే ఆ అక్రమ రిజిస్ట్రేషన్లు క్యాన్సిల్ చేసి అన్యాయం చేసిన ఆర్యవైశ్యులకు న్యాయం చేయాలని సూచించారు. భాస్కరన్న మీరు ఎంత ఎదిగినా మాకు ఏమి అభ్యంతరం లేదు..80 శాతం ఆర్యవైశ్య ఓట్లు వేయించిన మీరు వారికి అన్యాయం జరుగుతుంటే మీరెక్కడున్నారు. పొదిలి పట్టణానికి చెందిన ఆర్యవైశ్యులను మీరు ఏం చేయదలుచుకున్నారని సూటిగా ప్రశ్నించారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకులు యక్కలి శేషగిరిరావు, గొలమారి చెన్నారెడ్డి, మోరా శంకర్‌రెడ్డి, అక్కిదాసరి ఏడుకొండలు, మూరబోయిన మురళీకృష్ణ, ఫిరోజ్, భూమా రమేష్, కొత్తూరు శ్రీను, మంచికంటి సుధీర్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## పది రోజుల్లో వెలిగొండ జలాలు

**మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి**

**ఇంటింటికి తెలుగుదేశం వేగవంతం చేయాలని శ్రేణులకు పిలుపు**

**పొదిలి పట్టణంలో మండలస్థాయి సమీక్షా సమావేశం**




**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 21)**

పొదిలి పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు త్వరలోనే తాగునీటి సమస్య నుంచి శాశ్వత విముక్తి కలిగిస్తామని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం పొదిలి పట్టణంలోని ఆటో ఫైనాన్స్ కార్యాలయంలో మండల, పట్టణ తెలుగుదేశం పార్టీ క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్ల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని స్థానిక నాయకులు, కార్యకర్తలు ఏకతాటి పైకి వచ్చి అత్యంత వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మరో 10 రోజుల్లో వెలిగొండ ప్రాజెక్టు పనులను పూర్తి చేసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా వెలుగొండ సాగర్‌కు నీటిని విడుదల చేయిస్తామని తెలిపారు. పొదిలి మండలం, పట్టణ పరిధిలో ఇంటింటికి పైప్ లైన్ నిర్మాణ పనులను త్వరలోనే పూర్తి చేసి, ప్రాంతీయ మంచినీటి ▶4లో

## మీసాల వారి నూతన గృహప్రవేశం

**గాంధీ హాస్పిటల్ ప్రారంభోత్సవంలో**

**డాక్టర్ పెరుగు మురళీకృష్ణ యాదవ్ దంపతులు**



**(షణ్ముఖ వెలుగు, పామూరు, ఆగస్టు 21)**

పామూరు పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'మీసాల వారి గాంధీ హాస్పిటల్' ప్రారంభోత్సవం కార్యక్రమం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఏపీ మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ పెరుగు మురళీకృష్ణ యాదవ్, ఆయన సతీమణి డాక్టర్ యన్నాబత్తిన హరిత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. స్థానిక ప్రజలకు ఆధునిక సదుపాయాలతో మెరుగైన, నాణ్యమైన వైద్యాన్ని అందించాలని ఆకాంక్షిస్తూ హాస్పిటల్ యాజమాన్యానికి, వైద్యులకు ఈ సందర్భంగా వారు శుభాకాంక్షలు తెలిపారు.

## శర్వాణి కంపెనీలో ప్రమాదం

**ఐదుగురు కార్మికులకు తీవ్ర గాయాలు**

**శర్వాణి కంపెనీలో బయటపడ్డ డొల్లతనం**

**వాటర్ ప్లాంట్ గోడ కూలి ఐదుగురు కార్మికులకు తీవ్ర గాయాలు**

**గోడ కింద మరొక వ్యక్తి ఉన్నట్లు అనుమానం**

**(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, ఆగస్టు 21)**

తమ్మవరంలోని శర్వాణి బయో కంపెనీ నందు వాటర్ ప్లాంట్ గోడకూలి ఐదు మంది కార్మికులు తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. కార్మికులు విధులు నిర్వహిస్తున్న సమయంలో ప్లాంట్ గోడ ఒక్కసారిగా కూలి కార్మికుల పై పడింది. ఈ ప్రమాదంలో ఐదుగురు ▶4లో





# శర్వాణి కంపెనీలో ప్రమాదం



కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. గోడ కింద మరొక వ్యక్తి ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. గాయపడిన వారిని అద్దంకిలోని పల్నాడు ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఎస్సై సురేష్ పోలీస్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును ఆయన ఫ్యాక్టరీ యజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. అయితే ప్రమాదం పై గ్రామస్తుల నుంచి విమర్శలు వెలువెత్తుతున్నాయి. అసలు ఉన్నతాధికారులు భద్రతా చర్యలను పరిశీలించారా లేదా అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఫ్యాక్టరీని ఇటీవల నిర్మించి ప్రారంభోత్సవం చేశారని, అలాంటిది ఇప్పుడే కూలిపోవటం ఏమిటని వారు విమర్శిస్తున్నారు. యాజమాన్యం డొల్లతనం స్పష్టంగా కనిపిస్తుందని పలువురు గ్రామస్తులు చెబుతున్నారు. యాజమాన్యం నిర్లక్ష్యం వల్లనే ఐదుగురు కార్మికులకు తీవ్ర గాయాలు అయ్యాయని వారు ఆరోపిస్తున్నారు. ప్రమాద ఘటన పై ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామంలోని ప్రజలు కోరుతున్నారు.

# పది రోజుల్లో వెలిగొండ జలాలు





సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో పొదిలి నగర పంచాయతీ క్లస్టర్ ఇన్‌ఛార్జి వరికుంట్ల అనిల్ (పండు), పొదిలి పట్టణ అధ్యక్షులు ముల్లా ఖుద్దూస్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి మీగడ ఓబుల్‌రెడ్డి, మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ స్వర్ణ గీత, పొదిలి ఏఎంసి ఛైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసా, ఏఎంసి డైరక్టర్ సోమిశెట్టి శ్రీదేవి, మండల పార్టీ అధ్యక్షులు దోర్నాల అంజిరెడ్డి, మాజీ సర్పంచ్ కాటూరి నారాయణ ప్రతాప్, మర్రిపూడి ఎంపిపి వాకా వెంకటరెడ్డి, మాజీ శివాలయం కమిటీ ఛైర్మన్ సామంతపూడి నాగేశ్వరరావు, పార్టీ క్లస్టర్, యూనిట్ ఇంచార్జిలు, బూత్ కన్వీనర్లు, ప్రజా ప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పువ్వాడి వెంకటేశ్వర్లును పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు



**(షణ్ముఖ వెలుగు, పామూరు, ఆగస్టు 21)**

పామూరు మండలం టిడిపి మాజీ మండల పార్టీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు ఇటీవల గుండె సంభంధిత శస్త్ర చికిత్స చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న కనిగిరి మాజీ ఎమ్మెల్యే, విశాఖపట్నం పార్లమెంట్ వైసీపీ పరిశీలకులు కదిరి బాబురావు పామూరులోని వెంకటేశ్వర్లు నివాసగృహానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితులు అడిగితెలుసుకున్నారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.




# మైదుకూరు అమ్మవారిశాలలో ఘనంగా వరలక్ష్మీ వ్రతం

**(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, ఆగస్టు 21)**

స్థానిక అమ్మవారిశాలలో మైదుకూరు ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు బల్లాని సునంద మరియు వారి కమిటీ ఆధ్వర్యంలో శ్రావణ వరలక్ష్మీ వ్రత మహోత్సవం భక్తిశ్రద్ధలతో, అత్యంత ఘనంగా నిర్వహించబడింది. మైదుకూరు పట్టణ ఆర్యవైశ్య మహిళలు, భక్తజనం పెద్ద ఎత్తున పాల్గొనడంతో అమ్మవారి ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో, ఆధ్యాత్మిక శోభతో విలసిల్లింది. శ్రావణ శుద్ధ నవమి పర్వదినాన ఆర్యవైశ్య మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని అత్యంత శ్రద్ధాభక్తులతో నిర్వహించారు. వ్రత పూజల అనంతరం అమ్మవారికి విశేషంగా మహా మంగళహారతి సమర్పించి, విచ్చేసిన భక్తులందరికీ తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం నిర్వహించిన కుంకుమార్చన కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళలు విశేషంగా పాల్గొన్నారు. పూజలో పాల్గొన్న మహిళలకు లక్కీ డిప్ తీసి విజేతలకు ఒడిబియ్యం అందజేశారు. అలాగే ఈ రోజు ప్రత్యేకంగా అమ్మవారి మూలవిరాట్ కు ధరింపజేసిన చీరతో పాటు, ఉత్సవ విగ్రహానికి అలంకరించిన పవిత్రమైన చీరలను వేలం వేయడం జరిగింది. భక్తులు పోటీపడి వేలంలో పాల్గొని అమ్మవారి ప్రసాదంగా చీరలను దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షులు బల్లాని చెన్నకేశవప్రసాద్ సెక్రటరీ కోటా అశోక్ కోశాధికారి దరిశా శ్రీనివాసులు, వారి కమిటీ సభ్యులు, మైదుకూరు ఆర్యవైశ్య మహిళా మండలి ప్రతినిధులు, పట్టణ ఆర్యవైశ్యులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని పూజా కార్యక్రమాలను విజయవంతం చేసి అమ్మవారి కృపాకటాక్షాలు పొందారు.







# పవన్ కళ్యాణ్‌కు పులుల ప్రాణాల పై ఉన్న ప్రేమ

## దళితుల సంక్షేమం, రక్షణ పై దళిత మంత్రులకు లేదు

## దళిత మంత్రుల శాఖలు మార్చాలి

## ముఖ్యమంత్రికి దళిత నేత నీలం నాగేంద్రరావు డిమాండ్




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 21)**

చంపుకు తినే పులుల ప్రాణాలపై సనాతన ధర్మ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఉన్న ప్రేమ అస్పృశ్య జాతులైన దళితుల సంక్షేమం రక్షణ పట్ల దళిత మంత్రులు స్వామి, అనిత, సంధ్య రాణిలకు లేదని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు విమర్శించారు. శుక్రవారం సమితి కార్యాలయంలో జరిగిన సమావేశంలో నీలం నాగేంద్రరావు మాట్లాడుతూ ఇటీవల నల్లమల ఫారెస్ట్ లో మనుషుల్ని చంపుకు తినే పులి పట్ల సానుభూతితో సనాతన ధర్మంతో తీవ్రంగా కలత చెంది పులి మరణం పై ప్రత్యేక విచారణకు ఆదేశించి పవన్ కళ్యాణ్ పుణ్య జీవిగా మారేడు అన్నారు. క్రూర జంతువైన పులిని చంపిన మానవ మృగాలను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని హై పవర్ కమిటీని ఆదేశించిన క్రూరా జంతువుల రక్షకుడు పవన్ కళ్యాణ్ ను చూసి అయినా దళిత మంత్రులు డోలా బాల వీరాంజనేయ స్వామి, హోంమంత్రి అనిత గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి స్ఫూర్తి పొందాలన్నారు. 25% జనాభా కలిగిన ఎస్సీ ఎస్టీ ప్రజల ప్రాణాల పట్ల జాలి దయ లేని "జనసేన పార్టీ" అధినేత విశ్వ గురువు మోడీ భక్తుడు పవన్ కళ్యాణ్ ఆదేశాలతో పులిని చంపిన మానవులను ఫారెస్ట్ అధికారులు అరెస్ట్ చేశారు. కానీ రాష్ట్రంలో దళితులను హత్య చేసిన అగ్రకుల హంతకులను కూటమి ప్రభుత్వ ఖాకీలు అరెస్టు చేయటంలేదన్నారు. దళితులపై దాడులు జరిగిన ఎస్సీ ఎస్టీ ఆక్ట్ వేయటం లేదన్నారు. ఎస్సీ ఎస్టీ హత్య, అత్యాచార కేసుల్లో రాజధాని ప్రాంతమైన గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాలో కూడా రిలీఫ్ ఫైల్లు ముందుకు కదలటం లేదన్నారు. 5 ఎకరాల భూమి ఇవ్వవలసి ఉండగా కనీసం ఇంటి స్థలాలు కూడా జిల్లా కలెక్టర్లు ఎస్సీ ఎస్టీ రిలీఫ్ చట్టం 95 ప్రకారం ఇవ్వటం లేదన్నారు. విజయవాడలో క్రాంతి కుమార్ మాదిగ యువకుడు కృష్ణలంక సస్పెండెడ్ సీఐ నాగరాజు కాపు ఖాకీ నయీం వేధింపులకు గురై బలవన్మరణం చెందితే కూటమి ఖాకీలు రాజమండ్రి జైల్లో ఉన్న సీఐ నాగరాజును కనీసం కస్టడీలోకి తీసుకొని విచారించలేదన్నారు. విజయవాడ కమిషనర్ కు ఫిర్యాదు చేసిన ఎస్సీ ఎస్టీ సెక్షన్ గా మార్చేరే కానీ క్రాంతి కేసులో సస్పెండెడ్ సిఐ నాగరాజును అరెస్టు చూపించలేదు అన్నారు అలాగే కర్నూలు జిల్లాలో మాల గంగమ్మ పోలీస్ కస్టడీలో కూటమి ఖాకీల క్రూరత్వానికి చనిపోయిన కేసులో కూడా పోలీస్ అధికారులను అరెస్టు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వ ఎస్సీ ఎస్టీలపై హత్యలు దాడులు పోలీస్ అరాచకాలు పెరిగిపోయిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంతవరకు ఎస్సీ ఎస్టీ స్టేట్ లెవెల్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయలేదన్నారు. ఎస్సీ ఎస్టీ చట్టానికి తూట్లు పొరుస్తూ కూటమి ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ కేసుల్లో అగ్రకుల ముద్దాయిలకు స్టేషన్ బెయిల్ ఇచ్చి రాసమర్యాదలు చేస్తుందన్నారు. నాగులప్పలపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో కందుల ప్రవీణ్ అను దళిత యువకుడు అగ్రకుల యువతుల మోసానికి పోలీస్ వేధింపులకు గురై బలవన్ మరణం చెందిన అమానుష మరణాన్ని ఒంగోలు డిఎస్పి రాయపాటి శ్రీనివాసరావు సాక్షాదారాలు ఉన్నా కానీ ఫాల్స్ గా రిఫర్ చేయటం కూటమి ప్రభుత్వ అగ్రకుల ఖాకీ అరాచకానికి నిదర్శనం అన్నారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాలకు నిధులు తీసుకురాకుండా ఎస్సీ ఎస్టీ రక్షణ చట్టాలను అమలుపరచకుండా ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి అవరోధంగా మారిన దళిత మంత్రులు డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, హోంమంత్రి వంగలపూడి అనిత, గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి లను కూటమి ప్రభుత్వం మార్చాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ తన పాలనలో రెండేళ్లకే మంత్రులందరినీ మార్చి పరిపాలనను ప్రక్షాళన చేసిన విషయాన్ని కూటమి ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలని నేను నాగేంద్ర సూచించారు.

# నేడు స్వచ్ఛంద్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం జయప్రదం చేయండి

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఆగస్టు 21)

ప్రతి నెల మూడవ శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వర్ణ ఆంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంను ప్రతి ఒక్కరు పాల్గొని జయప్రదం చేయాలని కనిగిరి మున్సిపల్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు కనిగిరి పురపాలక సంఘం ఆధ్వర్యంలో శివనగర్ కాలని నందు శ్రమదాన కార్యక్రమం ద్వారా మేజర్, మీడియం, మైనర్ కాలువలు శుభ్రం చేయించి పరిసరాలు పరిశుభ్రత పై ప్రజలకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ప్రజా ప్రతినిధులు, అధికారులు, మున్సిపల్, సచివాలయ, మెప్మా సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. కావున ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు విధిగా పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పేర్కొన్నారు.

# వివాహ వేడుకకు హాజరైన బుర్రా





(షణ్ముఖ వెలుగు, గుడ్లూరు, ఆగస్టు 21)

మండలంలోని రాళ్లపాడు గ్రామంలో దగ్గుమాటి యల్లయ్య, కాంతమ్మ ఏకైక పుత్రుడు మహేష్, శివలక్ష్మీ వివాహ వేడుకలలో పాల్గొని నూతన వధూవరులను మాజీ ఎమ్మెల్యే, కందుకూరు నియోజకవర్గ వైయస్ఆర్సీపీ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# కంభం బస్టాండ్‌లో వాహన తనిఖీలు నిర్వహించిన ఎస్ఐ శివ కృష్ణారెడ్డి



(షణ్ముఖ వెలుగు, కంభం, ఆగస్టు 21)

జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు కంభం ఎస్ఐ శివకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం కంభం బస్టాండ్ సెంటర్‌లో విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రజలకు భద్రతా భావన కల్పించేలా విజిబుల్ పోలీసింగ్ చేపట్టిన పోలీసులు బస్టాండ్ సెంటర్‌లో అనుమానాస్పద వాహనాలు, వాహనదారులను తనిఖీ చేశారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా కంభం పట్టణంలో నిరంతరం వాహన తనిఖీలు, విజిబుల్ పోలీసింగ్ కొనసాగిస్తామని ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# రూరల్ సీఐ మాచర్ల వేణు ఆధ్వర్యంలో కండ్లకుంటలో కార్డన్ సెర్చ్

(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, ఆగస్టు 21)

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా వెల్దుర్తి మండలం కండ్లకుంట గ్రామంలో పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మాచర్ల రూరల్ సీఐ వేణు ఆధ్వర్యంలో గ్రామంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సోదాల్లో 29 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో, రెండు గొడ్డళ్లు, ఒక గడ్డపలుగు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సోదాల్లో వెల్దుర్తి ఎస్ఐ సత్యనారాయణ, మాచర్ల రూరల్ ఎస్ఐ వెంకట్రావు, కారంపూడి ఎస్ఐ వాసుతో పాటు 30 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ వేణు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ముందస్తు భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. నేర చరిత్ర కలిగిన వ్యక్తులను గుర్తించి బైండోవర్ చేస్తామని, ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాల పై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని, ప్రతి వాహనానికి ఇన్సూరెన్స్ ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని కోరారు. డ్రగ్స్, మాదకద్రవ్యాలు, సోషల్ మీడియా ప్రభావంతో యువత పెడదారి పట్టకుండా తల్లిదండ్రులు తమ పిల్లల నడవడికపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. డ్రగ్స్ విక్రయించినా, వినియోగించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీసుల నిఘా, ముందస్తు భద్రతా చర్యలు కొనసాగుతాయని సీఐ వేణు తెలిపారు.



# ప్రజా భద్రతే ధ్యేయం

## బీమలింగయ్యపల్లిలో ఘనంగా అవగాహన సదస్సు

## మహిళల భద్రత, సైబర్ నేరాల పై అవగాహన కల్పించిన ఎస్ఐ కత్తి వెంకటరమణ

(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, ఆగస్టు 21)

ప్రజల రక్షణ, గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా మైదుకూరు ఎస్ఐ కత్తి వెంకటరమణ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. మండల పరిధిలోని బీమలింగయ్యపల్లి గ్రామంలో శుక్రవారం నాడు ఆయన స్థానిక ప్రజలతో కలిసి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలతో, ముఖ్యంగా మహిళలతో ప్రత్యక్షంగా ముఖాముఖి మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ కత్తి వెంకటరమణ నేటి ఆధునిక కాలంలో మహిళల భద్రత, పెరుగుతున్న సైబర్ మోసాలపై ప్రజలకు క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. ఎస్ఐ కత్తి వెంకటరమణ మహిళల పై జరుగుతున్న అక్రమాలు, వేధింపులను అరికట్టేందుకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. మహిళలకు ఏవైనా వేధింపులు ఎదురైతే భయపడకుండా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని, భద్రతా యాప్‌లు, అత్యవసర సహాయక నంబర్ల పట్ల అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు, నకిలీ లింకులు, లోన్ యాప్‌ల ఉచ్చులో పడకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులకు ఓటీపీ లు, బ్యాంకు వివరాలు చెప్పకూడదని హెచ్చరించారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్‌కు లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో స్వయంగా పర్యటించి, ప్రజలకు భరోసానిస్తూ అవగాహన కల్పించిన ఎస్ఐ కత్తి వెంకటరమణ పనితీరు పట్ల బీమలింగయ్యపల్లి గ్రామస్థులు, మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు అండగా నిలుస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న మైదుకూరు పోలీస్ యంత్రాంగాన్ని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు స్టేషన్ పోలీస్ సిబ్బంది, బీమలింగయ్యపల్లి గ్రామ పురప్రముఖులు, మహిళలు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.



# గురుకుల పాఠశాల వనిపెంటలో ఘనంగా వరలక్ష్మీ వ్రతం

(షణ్ముఖ వెలుగు, వనిపెంట, ఆగస్టు 21)



షణ్ముఖ వెలుగు న్యూస్ వనిపెంట ఆగస్టు 21 మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల, కళాశాల, వనిపెంటలో వరలక్ష్మీ వ్రతాన్ని విద్యార్థుల సమక్షంలో ప్రధానాచార్యురాలు మరియు ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి, సాంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులందరూ అమ్మవారిని దర్శించుకుని, పూజా కార్యక్రమాల్లో భక్తిశ్రద్ధలతో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం విద్యార్థులందరికీ ప్రసాదాలను అందించారు. ప్రసాదంగా స్వీట్ పొంగలి, నిమ్మకాయ పులిహోర, దద్దోజనం, పంచామృతాన్ని విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల సమిష్టి సహకారంతో వరలక్ష్మీ వ్రత కార్యక్రమాన్ని విజయవంతంగా, సాంప్రదాయబద్ధంగా నిర్వహించగలిగినందుకు ప్రధానాచార్యురాలు నిర్మలరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో భక్తిభావంతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహనను పెంపొందించేలా సాగింది.





# కోటబొమ్మాళి సామాజిక ఆసుపత్రికి మహర్దశ

**త్వరలో వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి**

**రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**వైద్య రంగాన్ని బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యం**

**ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి**

**(షణ్ముఖ వెలుగు, శ్రీకాకుళం, ఆగస్టు 21)**

కోటబొమ్మాళి సామాజిక ఆసుపత్రిని త్వరలో వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడతామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కోటబొమ్మాళి సామాజిక ఆరోగ్య కేంద్రంలో నాబార్డు నిధులు రూ.2.90 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన ప్రసూతి, శిశు ఆరోగ్య విభాగం భవనాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు





అచ్చెన్నాయుడు గారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వైద్య, ఆరోగ్య రంగానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ మౌలిక వసతులను బలోపేతం చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సైతం నాణ్యమైన వైద్య సేవలు సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కోటబొమ్మాళి సామాజిక ఆసుపత్రిని వంద పడకల స్థాయికి పెంచి మరింత మెరుగైన వైద్య సేవలు అందించేలా అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు.

సాధారణ ప్రసవాల పై అవగాహన కల్పించాలి

ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించేలా గర్భిణులకు అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రసూతి, శిశు ఆరోగ్య సేవలను మరింత విస్తృతం చేసి ప్రజలకు చేరువ చేయాలని అన్నారు.

మానవతా దృక్పథంతో సేవలందించాలి

వైద్యులు, నర్సులు, ఇతర వైద్య సిబ్బంది మానవతా దృక్పథంతో వ్యవహరించి రోగులకు ఆప్యాయతతో సేవలందించాలని మంత్రి సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సంతృప్తికరమైన వైద్య సేవలు అందించి ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని కోరారు. ఆసుపత్రి పరిసరాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. రోగులకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేలా ఆసుపత్రి ప్రాంగణాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆసుపత్రి నిర్వహణ, పరిశుభ్రత పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహమ్మద్ ఖాన్, ఆర్డీఓ ఎం. కృష్ణమూర్తి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డా. విజయలక్ష్మి, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరిప్రసాద్, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఝాన్సీలక్ష్మి, మెడికల్ ఆఫీసర్లు పి. గణేష్, వైద్యులు, వైద్య సిబ్బంది, తదితరులు



# ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం



**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఆగస్టు 21)**

స్థానిక ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో శుక్రవారం బీసీలకు 34% రిజర్వేషన్ కల్పించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మండల టిడిపి ప్రధాన కార్యదర్శి మోర బోయిన మాల్యాద్రి మాట్లాడుతూ బీసీలకు రాజకీయంగా మరింత అవకాశాలు కల్పించాలని లక్ష్యంతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని తెలిపారు. 34 శాతం రిజర్వేషన్ తో స్థానిక సంస్థల్లో పాతినిధ్యం మరింత పెరుగుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పై బీసీలు కృతజ్ఞత తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రామాంజనేయులు, గెటబోయిన మల్లికార్జునరావు, మచ్చే ఆదయ్య, తాడి బోయిన రమణయ్య, పసల రమణయ్య, నరాల గంగయ్య, మండల టిడిపి నాయకులు కర్ణ కోటిరెడ్డి, మండవ ప్రసాద్, మండవ మురళీమోహన్, తదితరులు పాల్గొన్నారు.

# కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వల్లంకొండు వెంకటరమణకు ఘన సన్మానం

**వెంకటరమణ సేవలను అభినందించిన బద్వేలు పట్టణ అభివృద్ధి కమిటీ**

**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఆగస్టు 21)**

ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన వల్లంకొండు వెంకటరమణను బద్వేలు పట్టణ అభివృద్ధి సొసైటీ, ఆవాజ్ కమిటీ సభ్యులు శుక్రవారం ఆయన స్వగృహంలో పలువురు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు దుశ్శాలువ కప్పి, జ్ఞాపికను అందజేసి అభినందనలు తెలిపారు. వార్త దినపత్రిక రిపోర్టర్‌గా సేవలు అందిస్తూనే, ఆర్యవైశ్య వర్తకుల సంక్షేమానికి మరియు పలు సామాజిక సేవా కార్యక్రమాలకు





వెంకటరమణ విశేష కృషి చేశారని నాయకులు కొనియాడారు. ఈ సందర్భంగా బద్వేలు పట్టణ అభివృద్ధి సొసైటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నానబాల వెంకటేశ్వర్లు, బద్వేలు గురుమూర్తి మాట్లాడుతూ గడిచిన ఎన్నో సంవత్సరాలుగా ఆర్యవైశ్యుల సంక్షేమానికి, సమాజ శ్రేయస్సుకు వెంకటరమణ అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. సన్మాన గ్రహీత వల్లంకొండు వెంకటరమణ మాట్లాడుతూ తన పై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికీ, అలాగే తనను ఆత్మీయంగా సన్మానించిన బద్వేలు పట్టణ అభివృద్ధి సొసైటీ, ఆవాజ్ కమిటీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షులు ఎస్ఎ సత్తార్, గనుమంతు రాజేష్ కుమార్, జి నాగార్జున, వాయలేటి సూర్యనారాయణ, కార్యదర్శులు మారెల్ల శ్రీనివాసులు, తోట రాము, కార్యవర్గ సభ్యులు బొజ్జా బాలగురన్న, జయరామిరెడ్డి, ఆవుల వెంకట్, ఆవాజ్ కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్ అన్వర్ బాషా, పట్టణ సభ్యులు దర్గా సలీం, షేక్ నాగూర్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

# జూనియర్ కాలేజీలో ఘనంగా వరలక్ష్మి వ్రత పూజ

**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, ఆగస్టు 21)**

శ్రావణ మాస వరలక్ష్మి వ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని పలనాడు జూనియర్ కళాశాలలోని విద్యార్థినిలు అందరూ భక్తిశ్రద్ధలతో, కులమతాలకు అతీతంగా లక్ష్మీదేవి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తి పాటలతో, శ్లోకాలాపన చేస్తూ




సాగిన కార్యక్రమం ఎంతో ఉత్సాహభరితంగా ఉంది. కళాశాలలోని విద్యార్థిని, విద్యార్థులకు ఐకమత్య భావన, మంచి భక్తి భావాలను, ఆధ్యాత్మిక చింతన తో మనోభావాలను పెంపొందించుకునేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ పఠాన్ నాగూర్ వలి, ప్రిన్సిపాల్ నూతలపాటి శివ భాస్కర్ తెలిపారు. కళాశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు, విద్యార్థినీ విద్యార్థులకు, వారి కుటుంబ సభ్యులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రాధాకుమారి, మధురవాణి, మేరీ రాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# 629 ఏఈఈ పోస్టులకు 1.05 లక్షల అభ్యర్థులు పారదర్శకంగా ఏఈఈల నియామక పరీక్షలు

**23 నుంచి కంప్యూటర్ ఆధారిత పరీక్షలు**

**ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి పుల్లారెడ్డి**



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఆగస్టు 21)**

రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఎలక్ట్రికల్) పోస్టుల భర్తీకి ఈ నెల 23 నుంచి 27 వరకు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో పరీక్షలు నిర్వహించనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి పుల్లారెడ్డి తెలిపారు. పరీక్షలను పూర్తి పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. పరీక్షలు రోజుకు రెండు షిఫ్టుల్లో జరుగుతాయి. మొదటి షిఫ్ట్ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో షిఫ్ట్ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహిస్తారు. అభ్యర్థులు ఒరిజినల్ హాల్‌టికెట్‌తో పాటు ఆధార్, పాన్, ఓటర్ ఐడీ, పాస్‌పోర్ట్ లేదా డ్రైవింగ్ లైసెన్స్ వంటి ఫొటో గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో ఫేస్ వెరిఫికేషన్, మెటల్ డిటెక్టర్‌తో తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచీలు, కాలిక్యులేటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, పుస్తకాలు, కాగితాలు అనుమతించబోమన్నారు. ఉద్యోగం ఇప్పిస్తామంటూ దళారులు చేసే ప్రచారాన్ని నమ్మొద్దని, అధికారిక ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని సీఎండీ సూచించారు.


# బాపట్ల రెడ్ క్రాస్ భవనంలో ఉచిత హోమియో వైద్య శిబిరం




(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఆగస్టు 21)

శుక్రవారం బాపట్ల జిల్లాలోని రెడ్ క్రాస్ సొసైటీ భవనంనందు ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ వారి సౌజన్యంతో ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ మరియు జిల్లెలమూడి ప్రభుత్వ హోమియో వైద్యురాలు డాక్టర్ ఐనాపురపు భువనేశ్వరి రోగులను పరిశీలించి, అనంతరం ఉచిత హోమియో మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ ఉచిత హోమియో వైద్య శిబిరంలో అన్ని రకాల దీర్ఘకాలిక, తరుణ వ్యాధులకు, అలాగే వీటితో పాటు ఎక్కడా తగ్గని మొండి వ్యాధులకు అత్యుత్తమైన ప్రభుత్వ హోమియో వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, కావున బాపట్ల పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు ఈ ఉచిత హోమియో వైద్య శిబిర సేవలను వినియోగించుకొని, సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మారాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ నారాయణ బట్టు, సిబ్బంది పాల్గొన్నారు.

# అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్స్ పోస్టులకు నేడే చివరి తేదీ ఇప్పటికే 7 పోస్టులకు 34 దరఖాస్తులు




(షణ్ముఖ వెలుగు, కంభం, ఆగస్టు 21)

మండలంలో అకాడమిక్ ఇన్స్ట్రక్టర్స్ పోస్టుల దరఖాస్తుల స్వీకరణకు నేడు చివరిరోజు కావడంతో, శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా పబ్లిక్ హాలిడే ఉన్నప్పటికీ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. మండలంలో ఖాళీగా ఉన్న 7 అకడమిక్ ఇన్స్ట్రక్టర్ పోస్టులకు ఇప్పటికే 34 దరఖాస్తులు అందినట్లు మండల విద్యాశాఖ అధికారి అబ్దుల్ సత్తార్ తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ అర్హత ధ్రువపత్రాల ప్రతులను దరఖాస్తులతో జతపరిచి శుక్రవారం సాయంత్రం 5 గంటలలోపు ఎంఈవో కార్యాలయంలో సమర్పించవచ్చని సూచించారు. గడువు ముగిసిన అనంతరం దరఖాస్తులు స్వీకరించబడవని, అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ కోరారు.

# తిరుమావళవన్‌కు శుభాకాంక్షలు తెలిపిన ద్రావిడ దేశం కృష్ణారావు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 21)

విసికె పార్టీ జాతీయ అధ్యక్షుడు పార్లమెంటు సభ్యులు డాక్టర్ తిరుమావళవన్ 64వ జన్మదినోత్సవ సందర్భంగా ఉళుశీదూరుపేటైలో ఈ నెల 17 వ తేదీన జరిగిన గొప్ప బహిరంగ సభలో దాదాపు పది లక్షల మంది పాల్గొని సభను దిగ్విజయంగా జరిగిన సందర్భాన్ని కొనియాడుతూ తిరుమవళవన్‌ని చెన్నై వేళచేరిలోని క్యాంపు కార్యాలయంలో ద్రావిడ దేశం అధ్యక్షుడు వి కృష్ణారావు నేరుగా కలిసి అభినందనలు తెలియజేశారు. తగినంత పోలీసు భద్రత నడుమ ఇలాంటి సభలు జరుపుకోవడానికి చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కృష్ణారావు ఎంపీకి సూచించారు. వైద్యుల పర్యవేక్షణలో కొంతకాలం విశ్రాంతి తీసుకోవలసిందిగా కృష్ణారావు కోరారు. ఈ సందర్భంగా అందరికీ స్వీట్లు పంచి తిరుమావళవన్ తన ఆనందాన్ని అందరితో పంచుకున్నారు. ప్రకాశం జిల్లా బీసీ నాయకులు బంకా చిరంజీవి, బీసీవై పార్టీ చల్లా హరి యాదవ్, రాజా ధనవర్మ, కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక సమస్యల పై సమరశంఖం 24న కలెక్టరేట్ ముట్టడికి తరలిరావాలి

## సామాజిక శంఖారావం బైక్ యాత్రలో నేతల పిలుపు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 21)



దళితుల పై కొనసాగుతున్న సామాజిక వివక్షకు వ్యతిరేకంగా, వారి సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని సీఐటీయూ సీనియర్ నాయకులు ఘట్టమనేని శ్రీనివాసరావు, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సామాజిక శంఖారావం బైక్ యాత్రలో భాగంగా శుక్రవారం నగరంలోని పలు దళితవాడల్లో ప్రచారం నిర్వహించారు. ఈ నెల 24న కలెక్టరేట్‌కు దళితులంతా పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. నేతాజీ కాలనీ, చైతన్య కాలనీ, వెంకటేశ్వర కాలనీ, జయప్రకాష్ కాలనీ, జయప్రకాష్ కాలనీ ఎక్స్‌టెన్షన్, నెహ్రూ కాలనీ ఎక్స్‌టెన్షన్, వడ్డివానికుంట, గాంధీనగర్, యానాది కాలనీ, కొత్తడొంక, ప్రగతికాలనీ, గద్దలగుంట, మామిడిపాలెం తదితర ప్రాంతాల్లో బైక్ యాత్ర సాగింది. ఈ సందర్భంగా చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు గడుస్తున్నా దళితుల జీవన పరిస్థితుల్లో ఆశించిన మార్పు రాలేదన్నారు. సామాజిక, ఆర్థిక అసమానతలు, కుల వివక్ష ఇప్పటికీ కొనసాగుతుండటం పాలకుల వైఫల్యానికి నిదర్శనమన్నారు. వివక్ష కారణంగా దళితులు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయకపోవడంతో ఉన్నత విద్యను అభ్యసించిన దళిత యువతకు కూడా తగిన ఉపాధి లభించడం లేదన్నారు. ఫలితంగా అనేకమంది అసంఘటిత కార్మికులుగా దుర్భర జీవితం గడుపుతున్నారని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు ప్రతి ఒక్కరికీ సమానంగా అందేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### దళితవాడల్లో మౌలిక వసతులు కరవు

దళితవాడల్లో రోడ్లు, డ్రెయినేజీ, మురుగునీటి పారుదల, మంచినీటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని చీకటి శ్రీనివాసరావు తెలిపారు. రోడ్డు ఉంటే కాలువ ఉండదు.. కాలువ ఉంటే రోడ్డు ఉండదు.. రెండూ ఉంటే స్మశాన వాటిక సమస్య ఎదురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస మౌలిక వసతులు కల్పించకుండా దళితుల అభివృద్ధి గురించి పాలకులు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను వారికే ఖర్చు చేయాలని, దళితులకు అందాల్సిన 26 రకాల ప్రభుత్వ సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. కోనేరు రంగారావు కమిషన్ సిఫార్సుల మేరకు ప్రతి దళిత కుటుంబానికి రెండు ఎకరాల భూమి ఇవ్వాలని కోరారు. దళితవాడల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కుల వివక్ష, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో దళితులంతా ఐక్యంగా పాల్గొని 24న కలెక్టరేట్‌కు తరలిరావాలని వారు కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర కన్వీనర్ టి మహేష్, బీవీ రావు, తంబి శ్రీనివాసులు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కేఎఫ్ బాబు, మున్సిపల్ యూనియన్ నాయకులు విజయమ్మ, శ్రీనివాసరావు, సీఐటీయూ నాయకులు శ్రీనివాసులు, ఆల్ పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్ వివేకా హత్య కేసులో కీలక పరిణామం

# తెలుగు రాష్ట్రాల్లో ఈడీ సోదాల కలకలం!

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, ఆగస్టు 21)

ఎమాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణలో భాగంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సోదాలు నిర్వహించడం తీవ్ర కలకలం రేపింది. హవాలా మార్గంలో భారీగా నగదు లావాదేవీలు జరిగినట్లు వస్తున్న అనుమానాల నేపథ్యంలో ఈడీ అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో 10 ప్రాంతాల్లో ఈ తనిఖీలు చేపట్టారు.ఎఆంధ్రప్రదేశ్‌లోని నాలుగు ప్రాంతాల్లో, హైదరాబాద్‌లోని ఆరు ప్రాంతాల్లో ఈ సోదాలు కొనసాగుతున్నాయి. కడప ఎంపీ అవినాష్ రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డి ఆస్తుల పై ప్రధానంగా దృష్టి సారించిన అధికారులు, హైదరాబాద్ కోకాపేటలోని ఎంపీ అవినాష్ రెడ్డి విల్లాలో తనిఖీలు చేపట్టారు. సోదాల సమయంలో ఎంపీ అవినాష్‌రెడ్డి ఇంట్లోనే ఉన్నారు. మరోవైపు పులివెందులలోని దేవిరెడ్డి శంకర్ రెడ్డి, దస్తగిరి ఇళ్లల్లో కూడా ఈడీ బృందాలు తనిఖీలు నిర్వహించాయి. అలాగే టి తుమ్మలపల్లిలోని ఎర్ర గంగిరెడ్డి ఇల్లు మరియు సునీల్ యాదవ్ ఇళ్లల్లో అధికారులు సోదాలు చేపట్టి పలు కీలక పత్రాలను పరిశీలిస్తున్నారు. హైదరాబాద్, కడప జిల్లాల్లో ఈడీ తనిఖీలు తీవ్ర ఉత్కంఠను రేపుతున్నాయి.









# పోషకాల గని.. తర్బూజా



సీజన్‌ను బట్టి మన జీవనశైలిలోనూ కొన్ని మార్పులు చేసుకోవాలి. ప్రత్యేకించి వేసవి కాలంలో శరీరానికి చలువనిచ్చే పండ్లను, కూరగాయలను ఆహారంలో తప్పకుండా భాగం చేసుకోవాల్సిందే. కాలానుగుణంగా లభించే పండ్లను అధికంగా తీసుకోవడం వల్ల శరీరంలో నీటి స్థాయులు పెరగడమే కాకుండా కాలక్రమేణా రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుందంటున్నారు నిపుణులు. ఇక ఎండ వేడిమి నుంచి శరీరానికి తక్షణ శక్తినందించే పండ్లు ఎన్నో ఉన్నప్పటికీ తర్బూజా ప్రత్యేకత వేరని చెబుతున్నారు.

పోషకాలు పుష్కలం!

ఈ పండులోని వివిధ పోషకాలు శరీరంలో నీటి స్థాయులను పెంచి డీహైడ్రేట్ కాకుండా కాపాడతాయి. ఇందులోని ఫైబర్ జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరిచి మలబద్ధకం నుంచి ఉపశమనం కలిగిస్తుంది.

తర్బూజాలో విటమిన్-ఎ కూడా అధికంగా ఉంటుంది. ఇది కంటి సమస్యలను దూరం చేయడమే కాకుండా కంటి చూపు సామర్థ్యాన్ని పెంచుతుందట.

క్యాలరీలు తక్కువగా ఉండే ఈ పండును ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల శరీర బరువును నియంత్రించుకోవడంలో సహాయపడుతుంది.

ఈ పండుని తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి మెరుగుపడుతుందట.

ఈ పండులోని పోషకాలు ఒత్తిడి, ఆందోళన సమస్యలను తగ్గించడమే కాకుండా కురుల సంరక్షణకు కూడా ఉపయోగపడతాయంటున్నారు నిపుణులు.

ఇన్ని ప్రయోజనాలున్నందుకే సమ్మర్‌లో ఈ పండును కచ్చితంగా డైట్‌లో చేర్చుకోవాలంటున్నారు నిపుణులు.

# వేసవిలో చలువ చేసేందుకు..

ఎండలు మొదలయ్యాయి. వాతావరణంలో వేడి పెరిగే కొద్దీ తరచూ పెదాలు ఎండిపోవడం, నాలుక తడారిపోవడం సహజమే! ఇది క్రమంగా డీహైడ్రేషన్ సమస్యకు దారితీస్తుంది. ఇలాంటప్పుడు మంచి నీటిని మరింత రుచిగా తయారుచేసుకొని తాగితే ఈ సమస్యను సులువుగా అధిగమించచ్చు.. తద్వారా శరీరానికి చలువ కూడా చేస్తుంది.

ఎండలు మొదలయ్యాయి. వాతావరణంలో వేడి పెరిగే కొద్దీ తరచూ పెదాలు ఎండిపోవడం, నాలుక తడారిపోవడం సహజమే! ఇది క్రమంగా డీహైడ్రేషన్ సమస్యకు దారితీస్తుంది. ఇలాంటప్పుడు మంచి నీటిని మరింత రుచిగా తయారుచేసుకొని తాగితే ఈ సమస్యను సులువుగా అధిగమించచ్చు.. తద్వారా శరీరానికి చలువ కూడా చేస్తుంది.



కొన్ని రకాల పండ్లు, కూరగాయలు, తులసి, పుదీనా లాంటి ప్రత్యేకమైన ఆకులు నీటిలో వేయడం వల్ల వాటిలోని యాంటీ ఆక్సిడెంట్‌లు, ఖనిజాలు నీటిని మరింత శక్తిమంతంగా మారుస్తాయంటున్నారు నిపుణులు. ఇవి డీహైడ్రేషన్ నుంచి కాపాడటమే కాకుండా శరీరంలోని మలినాలనూ తొలగిస్తాయి.? సన్నగా గుండ్రంగా తరిగిన కీరా ముక్కలు, నిమ్మకాయ ముక్కలు, కొన్ని పుదీనా లేదా తులసి ఆకులు నీటిలో వేయాలి. మంచినీటికి బదులుగా వీటిని తాగడం వల్ల డీహైడ్రేషన్ దరిచేరదు. అంతేకాదు.. నిమ్మకాయలోని ఎలక్ట్రోలైట్లు శరీరానికి శక్తినిచ్చి రోజంతా ఉత్సాహంగా ఉండేలా చేస్తాయి.



గుప్పెడు వట్టి వేర్లను శుభ్రం చేసి, ఒక నెట్‌క్లాత్‌లో వదులుగా కట్టి మంచినీటిలో వేయాలి. లేదా నేరుగా నీటిలో వేసి, వట్టి వేర్లు నీటి అడుగుకు చేరగానే పైన తేలిన నీటిని మంచినీళ్ల బదులుగా తాగితే శరీరంలోని వేడి తగ్గుతుంది. ఈ చిట్కా ఒత్తిడినీ దూరం చేస్తుందట. లీటరు నీటికి అర కప్పు చొప్పున పుచ్చకాయ ముక్కలు వేయాలి. అలాగే ఇందులో నాలుగు కీరా ముక్కలు, కొన్ని పుదీనా ఆకులు చేర్చాలి. మండే ఎండల్లో సైతం ఇది మీ శరీరాన్ని చల్లబరుస్తుంది. ముక్కలుగా చేసిన స్ట్రాబెర్రీ, గుండ్రంగా తరిగిన నారింజ ముక్కల్ని నీళ్లలో వేసుకొని తాగితే డీహైడ్రేషన్ తగ్గడమే కాకుండా.. శరీరానికి 'సి' విటమిన్ అందుతుంది. అంతేకాదు.. చర్మం కాంతివంతంగానూ మారుతుందట. గులాబీ రేకులను నీటిలో వేసి.. ఈ నీటిని తాగితే శరీరంలోని అధిక వేడి అదుపులోకి వస్తుందని చెబుతున్నారు నిపుణులు.

# చెమటతో తిప్పలా?



ఎండలో పొరపాటున బయట అడుగుపెట్టామంటే చాలు... చెమటతో ఒళ్లంతా తడిసిపోతుంది. శరీరానికి పట్టింది కాసేపటి ఆరిపోతుంది. కురులతోనే సమస్య. ఓ పట్టాన ఆరదు. పైగా దుర్వాసన, ఇన్‌ఫెక్షన్లు. తిప్పలు తప్పాలంటే... ఈ చిట్కాలు ప్రయత్నించండి.

ఎండలో పొరపాటున బయట అడుగుపెట్టామంటే చాలు... చెమటతో ఒళ్లంతా తడిసిపోతుంది. శరీరానికి పట్టింది కాసేపటి ఆరిపోతుంది. కురులతోనే సమస్య. ఓ పట్టాన ఆరదు. పైగా దుర్వాసన, ఇన్‌ఫెక్షన్లు. తిప్పలు తప్పాలంటే... ఈ చిట్కాలు ప్రయత్నించండి. తలలో చెమట తగ్గాలంటే ముందు చేయాల్సింది కేశ ఉత్పత్తులను మార్చడమే. ఈకాలం జిడ్డుగా ఉండే నూనెలు, క్రీమీ షాంపూలకు దూరంగా ఉండాలి. వీటికి మాడునుంచి విడుదలయ్యే నూనెలు, దుమ్మూ చేరి సూక్ష్మజీవులకు ఆవాసాలుగా మారతాయి. కాబట్టి, నీటి, జెల్ ఆధారిత షాంపూలను ఉపయోగించాలి. ఎండ వేడి నుంచి తప్పించుకోవడానికి చల్లదనం కోసం వెదుకుతుంటాం కదా! కురులకీ అది అవసరమే. అందుకని తలస్నానానికి ముందు కలబంద గుజ్జును కానీ, పుదీనా రసాన్ని కానీ మాడుకి పట్టించండి. ఇవి ఇన్‌ఫెక్షన్లను దూరంగా ఉంచడంతోపాటు, మాడునీ తాజాగా ఉంచుతాయి. ప్రతి రెండు రోజులకోసారి తలస్నానం తప్పనిసరి. అప్పుడు మాడు శుభ్రంగా ఉంటుంది. అయితే కురులు పూర్తిగా ఆరాకే జడ వేసుకోవాలి. జడనీ వీలైనంత వదులుగా వేసుకోండి. తలమీద నేరుగా పడే ఎండ కూడా చెమటకి కారణమే. కాబట్టి, ఎండలోకి వెళు_న్నప్పుడు కాటన్, గాలి ప్రసరణ బాగుండే వస్త్రాలు లేదా టోపీతో తలని కవర్ చేయడం అలవాటు చేసుకుంటే మంచిది. చెమట నుంచి పూర్తిగా తప్పించుకోవడం కష్టం. కానీ కొన్ని జాగ్రత్తలతో సమస్యల నుంచి తప్పించుకోవచ్చు. కురులనీ ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. ప్రయత్నించండి మరి.

# రోజ్ వాటర్ ఇలా కూడా



సౌందర్య పోషణకి వంటింటి చిట్కాలు పాటించే వాళ్ల దగ్గర తప్పక ఉండేదేదంటే రోజ్ వాటరే గుర్తొస్తుంది కదూ! దీన్ని ఫేస్ ప్యాక్‌లకే కాదు.. ఇంకా చాలా రకాలుగానూ వాడొచ్చని తెలుసా?

సౌందర్య పోషణకి వంటింటి చిట్కాలు పాటించే వాళ్ల దగ్గర తప్పక ఉండేదేదంటే రోజ్ వాటరే గుర్తొస్తుంది కదూ! దీన్ని ఫేస్ ప్యాక్‌లకే కాదు.. ఇంకా చాలా రకాలుగానూ వాడొచ్చని తెలుసా?

జుట్టు నిర్జీవంగా, గడ్డిలా కనిపిస్తోందా? అయితే రోజ్ వాటర్ స్ప్రే చేసి, ఆపై నెమ్మదిగా దువ్వండి. తేమ అంది, కురులు మెరుస్తాయి. మెత్తగా నిగనిగలాడుతూ కనిపించాలంటే గులాబీ నీటికి కొన్ని చుక్కలు ఆర్గాన్ ఆయిల్‌ని కలిపితే సరి.

సరిగా నిద్ర లేకపోయినా... బాగా అలసిపోయినా ఆ ప్రభావం కనిపించేది కళ్ల దగ్గరే కదూ! రోజ్ వాటర్‌ని కాసేపు ఫ్రిజ్‌లో ఉంచండి. తరవాత బయటకు తీసి, కాటన్ ప్యాడ్ మీద చిలకరించండి. ఆపై వాటిని కళ్లమీద ఉంచి, కాసేపు విశ్రాంతి తీసుకుంటే సరి. కళ్ల వాపు, ఎర్రదనం, అలసట... అన్నిటినీ మటుమాయం చేస్తుంది.

ఎండ వేడి, ఏసీ చల్లదనం ఏవైనా ముఖాన్ని నిర్జీవంగా మారుస్తాయి. అలాంటప్పుడు ముఖమ్మీద దీన్ని స్ప్రే చేసుకోండి. తేమను అందించడమే కాదు... తాజాగానూ మారుస్తుంది. పైగా మేకప్ వేసుకున్నా పనిచేస్తుంది. మిస్ట్‌లా పనికొస్తుంది కాబట్టి, బ్యాగులో తప్పక ఉంచుకోండి మరి.

ఎండలో కాసేపు ఉంటే చాలు చర్మం ఎర్రబడిపోతుంది చాలామందికి. ఆపై దురద, మంట. అలాంటప్పుడు చర్మాన్ని మరింత ఇరిటేట్ చేయని, ఇన్‌ఫ్లమేషన్ పెంచని పరిష్కారాలు కావాలా? అయితే రోజ్‌వాటర్‌ని కలబంద గుజ్జుతో కలిపి రాస్తే చాలు.

లిప్‌బామ్ ఎంత రాసినా ప్రయోజనం లేదా? ముందు కాస్త రోజ్‌వాటర్ పట్టించి, తరవాత లిప్‌బామ్ రాయాలి. దీనివల్ల తేమ ఎక్కువసేపు ఉంటుంది. పెదాలూ మృదువుగా కనిపిస్తాయి.

# కళ్ల కింద నల్లటి వలయాలు తగ్గాలంటే..



కళ్ల కింద నల్లటి వలయాలు.. చాలామందిని ఇబ్బంది పెట్టే సమస్యల్లో ఇది కూడా ఒకటి. అయితే ఈ సమస్యను కొన్ని సహజ చిట్కాలతోనే తగ్గించుకోవచ్చంటున్నారు నిపుణులు.

కళ్ల కింద నల్లటి వలయాలు.. చాలామందిని ఇబ్బంది పెట్టే సమస్యల్లో ఇది కూడా ఒకటి. అయితే ఈ సమస్యను కొన్ని సహజ చిట్కాలతోనే తగ్గించుకోవచ్చంటున్నారు నిపుణులు.


కారణాలేమిటి?నిద్రలేమి, అలసట, కంప్యూటర్/మొబైల్ ఎక్కువసేపు వాడడం, ఒత్తిడి, పోషకాహార లేమి, తగినన్ని నీళ్లు తీసుకోకపోవడం.. ఇలా చాలా అంశాలు కళ్ల కింద నల్లటి వలయాలకు కారణం కావచ్చంటున్నారు నిపుణులు. అదేవిధంగా హైపర్ పిగ్మెంటేషన్, వృద్ధాప్యం, ఎగ్జిమా, కొన్ని రకాల ఎలర్జీలు, ఎండలో ఎక్కువగా తిరగడం, మేకప్ పూర్తిగా తొలగించుకోకపోవడం.. వంటి కారణాల వల్ల కూడా కళ్ల కింద చర్మం నల్లగా మారే అవకాశం ఉందంటున్నారు.

ఈ మార్పులు తప్పనిసరి!

ఈ సమస్య పరిష్కారం కోసం జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవాలి. పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవడంతో పాటు రోజూ కనీసం 7-8 గంటలు కంటి నిండా నిద్ర పోవాలి. ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్ల వినియోగాన్ని తగ్గించాలి. ఒత్తిడి, ఆందోళనల నుంచి దూరంగా ఉండాలి. ఇందుకోసం ధ్యానం, యోగా.. మొదలైన వాటిని జీవనశైలిలో భాగం చేసుకోవాలి అని సూచిస్తున్నారు నిపుణులు.

ఈ సహజ చిట్కాలతో..

ముఖాన్ని శుభ్రపరచుకోవడం కోసం చర్మతత్వానికి సరిపడే సబ్బులను ఎంచుకోవాలి. మధ్యాహ్నం లంచ్ తర్వాత చాలామందికి నిద్ర ముంచుకొస్తుంటుంది. అయితే పని వల్లో, ఇతర కారణాల వల్లో ఆ నిద్రను ఆపుకోవడం.. లేదా కాఫీ, టీలతో నిద్రను దూరం చేసుకోవడం చేస్తుంటారు. ఇది మంచిది కాదు. ఇంట్లో ఉండే వారు వీలైతే మధ్యాహ్న సమయంలో కాసేపు కునుకు తీయడం వల్ల కంటి ఆరోగ్యం మెరుగవుతుంది. అయితే అది అరగంటకు మించకుండా చూసుకోవడం మంచిది. అర్ధరాత్రి వరకు మేల్కొనకుండా సాధ్యమైనంత త్వరగా నిద్రకు ఉపక్రమించాలి. దీనివల్ల కళ్లపై ఒత్తిడి తగ్గుతుంది. ఒత్తిడి, ఆందోళన కలిగించే వ్యక్తులు, వస్తువులకు పూర్తి దూరంగా ఉండాలి. ముఖ్యంగా ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్ల వాడకాన్ని తగ్గించాలి.యితే కళ్ల కింద నల్లటి వలయాలు ఒక్కోసారి అంతర్లీనంగా ఉండే కొన్ని ఆరోగ్య సమస్యలకు కూడా సంకేతం కావచ్చు. అందువల్ల పైన చెప్పిన చిట్కాలు పాటించినా సమస్య తగ్గకపోతే.. అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్య నిపుణులను సంప్రదించాలి.



On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com